بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

**Summary of Friday Sermon Huzur-e-Anwar 14.11.2014 (Telugu)**

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్‌లో చేరిన తర్వాత మనము ఇతరుల కంటే భిన్నముగా కనిపించవలెను. దైవ ఉనికిపై విశ్వాసము, నమ్మకము విషయములో కూడ మనము ఇతరుల కన్నా ప్రత్యేకముగా కనిపించవలెను, ఉన్నత స్థాయి పొందవలెను. ప్రార్థనలలో కూడ అసాధారణ రీతిలో కనిపించవలెను. ఉన్నత ప్రమాణములను పొందుటలో కూడ మనము ఇతరుల కంటే ముందుండవలెను.**

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 14.11.2014 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ – లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితపు వివిధ కోణములను తెలుపు పలు సంఘటనలను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు తెలిపిరి. నేడు కూడ నేను వాటినే ప్రస్తావింతును. వీటి ద్వారా హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు జీవితపు పలు విషయములు కూడ స్పష్టమగును. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు తమ గురించి ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను నేను తండ్రి అయినందున నమ్మలేదని నేను విజ్ఞానముతో తెలుపుచున్నాను. నా పరిశోధనలో నవూజుబిల్లాహ్ వారు అసత్యులని తేలినచో ఇంటి నుండి వెళ్ళిపోవుదునని నేను 11 సం॥ల వయసుకు చేరినప్పుడు గట్టిగా సంకల్పించితిని. కాని నేను వారి సత్యమును తెలుసుకొన్నాను. అనంతరం నా విశ్వాసము పెరుగుచూనే పోయినది. వారు పరమపదించినప్పుడు నా విశ్వాసము మరింత పెరిగినది. నేను ప్రత్యక్ష బైఅత్ చేసిన తర్వాత 10 సం॥ల వయసులోనే నా హృదయములో ఏర్పడిన ప్రతిచర్యను నేను పదాలలో వర్ణించలేను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బాల్యములోనే ఏ విధముగా ప్రార్థనల వైపు దృష్టి మరల్చేవారో, (encourage) ప్రోత్సహించేవారో తెలుపు ఒక విషయము వారిట్లు తెలిపిరి. "అల్లాహ్ అవతారుడు మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనుద్దేశించి అల్లాహ్ ఇట్లనెను. اجیب کل دعائک الا فی شرکائک దాయాదుల విషయములో తప్ప నీ ఇతర ప్రార్థనలను నేను ఆమోదింతును. 9 సం॥ల వయసు గల నాకు దుఆ చేయమని హిస్రీ మార్టిన్ క్లార్క్ వాజ్యము సమయమున చెప్పినారు. ఇంటి పని మనుషులు, స్త్రీలను సైతం ప్రార్థనలు చేయవలెననిరి.

అన్ని ప్రార్థనలు ఆమోదించబడునని వాగ్దానము పొందిన వారు ఇతరులతో ప్రార్థనలు చేయించుట అనివార్యమని భావించినప్పుడు ఇతరులు ఇటువైపు ఎంత శ్రద్ధ వహించవలెను. వారి కొందరి బంధువుల తరపున వేయబడిన వాజ్యము గురించి వారొకసారి ప్రార్థన చేయుచున్న సందర్భమున اجیب کل دعائک الا فی شرکائک ఈ దైవవాణి అందినదని బహుశా కొందరికి తెలియదు కాబోలు. అనవసరముగా న్యాయవాదులు, వాజ్యముల కొరకు నగదును వృదా చేయకుము. ఈ వాజ్యములో మీరు ఓటమి పాలగుదురు.

అని నేను చెప్పియుంటిని. కాని క్రింది న్యాయస్థానములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరపు బంధువుల పక్షమున తీర్పు వెలువడినది. రెండవ సారి అభ్యర్థన వేయగా ప్రధాన న్యాయస్థానములో ఓటమికి గురైరి. అల్లాహ్ స్పష్టముగా చెప్పిన తార్వత ఈ వాజ్యములో ఎట్లు విజయము సాధింతురని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి.

గోడ వాజ్యము అనునది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో వాదించబడిన ప్రఖ్యాత వాజ్యము. ఇందులో వారి వంశపు వ్యతిరేకులు మస్జిద్ దారిలో గోడను నిర్మించి దారిని మూసివేసిరి. కొందరు అహ్మదీయులు అత్యుత్సాహములో గోడను కూల గొట్టుటకు కూడ సంకల్పించిరి. కాని సహనము వహించుట, చట్టమును అవలంభించుట మన కర్తవ్యమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆదేశించిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజయల్లాహు అన్‌హు ఇట్లనిరి. గోడ కూలగొట్టబడుచున్నట్లు, ప్రజలు ఒక్కొక్క ఇటుకను తీసి, విసిరి వేయుచున్నట్లు నేను స్వప్నములో చూచి యుంటిని. అంతకు ముందు కొంతమేరకు వర్షము పడినట్లు కూడ తెలియుచున్నది. ఇదే పరిస్థితిని నేను (స్వప్నములో) చూసినాను. మస్జిద్ వైపు నుండి హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజయల్లాహు అన్‌హు వచ్చుచున్నారు. వాజ్యము గురించి తీర్పు వెలువడినప్పుడు మొత్తం ఇటులనే సంభవించెను. ఈ ప్వప్నమును నేను ముందే వారికి చెప్పియుంటిని. కనుక వారు నన్ను చూడగానే హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజయల్లాహు అన్‌హు చూడు! బాబు! నేడు నీ స్వప్నము పూర్తి అయినదని అనిరి.

పిల్లలను ఆనంద పరచే తమ గురించి ఒక సంఘటనను తెలుపుచు వారిట్లనిరి. నాకు నా బాల్యపు ఒక సంఘటన గుర్తున్నది. మా తల్లి ఒక్కో సారి అసంతృప్తితో ఇతని (హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజయల్లాహు అన్‌హు) తల చాలా చిన్నగా వున్నదని అనేవారు. బదులుగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనేవారు. ఇదేమి విచారించదగ్గ విషయము కాదు. ముఖ్యమైన విషయమేమనగా మనము అల్లాహ్, ప్రవక్త ఆజ్ఞలను అర్థము చేసుకొని గ్రహించవలెను. వాటి భావమును అర్థము చేసుకొనుటకు ప్రయత్నించవలెను. పవిత్ర ఖుర్‌ఆన్‌ను అర్థము చేసుకోవలెను. ఇదే యదార్థము. దీనితోనే మెదడు కాంతివంతమగును. ప్రభుత్వము పట్ల ఒక విశ్వసనీయత గురించి వారొక చోట ఇట్లనిరి. నా చిన్నప్పుడు నాకు తెలివి రాగానే ప్రభుత్వము పట్ల విశ్వసనీయత గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం నోట వినియుంటిని. ఈ ఆజ్ఞను నేను గట్టిగా పాటించితిని. ఆంగ్లేయులు నాటిన మొక్క అని విమర్శించే నా అతి సమీప మిత్రులతో కూడ ఈ విషయములో విభేదించినాను. వారు స్వాతంత్ర్యము ఇచ్చినందుకు వారిని కరుణగా భావించి, ఆ జాతిని పొగిడిరి. కలముతో ప్రయత్నించు విషయము గురించి వారిట్లనిరి. సందేశహరుల హృదయము కృతజ్ఞత భావము కలిగియుండును. అతి సాధారణ విషయమును కూడ పెద్ద ఉపకారముగా భావింతురు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుస్తకములు దివారాత్రులు ప్రచురించబడేవి. వారు కొన్ని కొన్ని రాత్రులు అసలే నిద్రించేవారు కాదు. నేను ఎన్నో సార్లు వారిని పనిచేయుచుండగా చూచుచు నిద్రకు ఉపక్రమించేవాడిని. నేను నిద్ర లేవగా వారిని పని చేయుచుండగానే చూచేవాడిని. ఇటులనే తెల్లవారేది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు వారిని, వారి స్థాయిని ఎంతో గౌరవించేవారు. ఇందుకు ఎవరిని లెక్క చేసేవారు కాదు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు తమ గురించి ఒక సంఘటన ఇట్లు తెలిపిరి. ఈ సంఘటన తెలిపి ఇస్లాం ప్రవర్తనలను, విలువలను గుర్తుంచుకోవలెను, సదా

వాటిని పాటించవలెనని మన యువకులకు హితబోధ చేసిరి. వారు తమ ఒక ఖుత్బాలో ఇట్లు ప్రస్తావించిరి. నవయువకులకు ఇస్లాం సద్గుణములను నేర్పుటకు కొందరు శ్రద్ధ వహించరు. నవయువకులు నిస్సంకోచంగా ఒకరి భుజాల పై మరొకరు చేతులు వేసుకొని తిరుగుచూ వుందురు. బాల్యములోని కొందరి శిక్షణ ప్రభావము నాపై ఇప్పటికి గలదు. ఆ సంఘటన గుర్తు రాగానే తనంతట తానే వారి కొరకు ప్రార్థన వెలువడును. నేనొకసారి ఒక బాలుని భుజముపై చేయి వేసి నిలబడి యుంటిని. మౌల్వీ అబ్దుర్రహీం దర్ద్ గారి తండ్రి మాస్టర్ ఖాదర్ బఖ్ష్ గారు నన్ను నివారించి, ఇది చాలా దురలవాటని అనిరి. అప్పుడు నా వయసు 12,13 సం॥లుండెను. కాని ఈ దృశ్యము ఎప్పుడు కనిపించినా వారి కొరకు హృదయపూర్వకముగా దుఆ వెలువడును.

ఇటులనే మురాదాబాద్ నివాసి అయిన ఒక సూబేదార్ గారి మాట నాకింకా గుర్తున్నది. గుర్దాస్‌పూర్‌లో వాజ్యముండెను. నేను మాట్లాడుచుండగా హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను "నువ్వు" అని అన్నాను. ఆ సూబేదార్ గారు నన్ను విడిగా తీసుకెళ్ళి ఇట్లనిరి. మీరు హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పుత్రులు. మాకు గౌరవనీయులే. కాని "నువ్వు" అను పదము సరిసమానము గల వ్యక్తులకు ఉపయోగించబడును. పెద్దల కొరకు కాదు. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కొరకు దీనిని ఉపయోగించుట నేను ఏ మాత్రం భరించలేను. దీని గురించి వారు నాకిచ్చిన మొదటి పాఠమిది.

కావున ఇస్లాం విలువల పట్ల మనము ప్రత్యేక శ్రద్ధ వహించవలెను. మరో సంఘటన హ్రజత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లు తెలిపిరి. మేము కూడ బాల్యములో వివిధ ఆటలు ఆడేవారము. నేను సామాన్యముగా ఫుట్ బాల్ ఆడేవాడిని. క్రికెట్ ఆడే వారు ఖాదియాన్ వచ్చినప్పుడు వారు క్రికెట్ టీమ్ సిద్ధము చేసిరి. ఒక రోజు వారు నా వద్దకు వచ్చి క్రికెట్ ఆడుటకు రాగలరని నీవు వెళ్ళి హ్రజత్ గారిని వేడుకొనుమని అనిరి. కనుక నేను లోపికి వెళ్ళినాను. అప్పుడు వారొక పుస్తకము వ్రాయుచుండిరి. నేను నా ఉద్దేశము చెప్పినప్పుడు వారు తమ కలము క్రింద పెట్టి ఇట్లనిరి. మీ బంతి మైదానము దాటి బయటికి వెళ్ళదు. కాని ప్రపంచ నలు మూలలకు చేరు క్రికెట్ బంతితో నేను ఆడుచున్నాను. ఇప్పుడు చూడుము! వారి బంతి ప్రపంచ నలుమూలలకు చేరినదా లేదా ? ఖాదియాన్‌లో కూర్చొని హిట్ చేసిన బంతే నేడు ప్రపంచ నలుమూలలకు వ్యాపించుచున్నది.

కష్టపడనిదే ధార్మిక, ప్రాపంచిక గౌరవము ఏ మానవుడు సాధించలేడని తెలుపు ఒక సంఘటన వారిట్లు తెలిపిరి. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనే వారు. మా కాలములో గౌరవమును మొత్తం అల్లాహ్ మాతో జోడించెను. అనగా ఈ కాలములో గౌరవములన్నియు హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ముడిపడి వున్నవి. ధర్మముతో ఎవరైనా లబ్ధి పొందాలంటే తనను తాను అల్లాహ్‌కు అంకితము చేయుటయే సరైన మార్గము. కాని జాతికి జాతి ఇటుల చేసినచో జాతికి ప్రత్యేక అనుగ్రహము కలుగును. వారికి ప్రతి మైదానములో విజయము లభించును. మన సంఘము కూడ తప్పక ఈ అడుగు వేయవలెను. హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్‌లో చేరిన తర్వాత మనము ఇతరుల కంటే భిన్నముగా కనిపించవలెను. దైవ ఉనికిపై విశ్వాసము, నమ్మకము విషయములో కూడ మనము ఇతరుల కన్నా ప్రత్యేకముగా కనిపించవలెను, ఉన్నత స్థాయి పొందవలెను. ప్రార్థనలలో కూడ అసాధారణ రీతిలో కనిపించవలెను. ఉన్నత ప్రమాణములను పొందుటలో కూడ మనము ఇతరుల కంటే ముందుండవలెను. చట్టమును పాటించుటలో కూడ మనము స్ఫూర్తిగా నిలువవలెను. ప్రతి విషయములో ఒక అహ్మదీ ఇతరుల కంటే ప్రత్యేకముగా కనిపించవలసిన అవసరము గలదు. అప్పుడే మనము హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్‌తో సరైన లబ్ధి పొందగలము.

ఉపకారము, సత్ప్రవర్తన గురించి ఒక సంఘటన ఇట్లు తెలిపిరి. ఒక ప్రభుత్వ అధికారి ఖాదియాన్ వచ్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో ఇట్లనెను. వీరు మీ పౌరులు. మీరు వీరితో మెత్తదనముతో వ్యవహరించగలరు. హజ్రత్ గారిట్లనిరి. ఈ వృద్ధునితో అడుగము. నష్టము కలిగించే ఏ సమయము వచ్చినా వీరు నాకు నష్టము కలించలేదా ? మరల ఇతనినే ప్రశ్నించుము. ఉపకారము చేయగల సమయము వచ్చినప్పుడు నేను వీరికి ఉపకారము చేసినానా లేదా ? అప్పుడా వృద్ధుడు తల వంచుకొని ఏ సమాధానము చెప్పలేక పోయెను. వారి సద్గుణముల గొప్ప ఉదాహరణ ఇది. సద్గుణములలో మన సంఘము కూడ ఒక ఆదర్శము కావలెను. ఒక్క పైసా కూడ ఇంట్లో లేకన్నా న్యాసమును ముట్టుకోకూడదు. ఎంత మధురముగా మాట్లాడవలెననగా ఇతరుల హృదయాలను ప్రభావితము చేయవలెను. అల్లాహ్ వైపున రెండు రకాల పరీక్షలు వచ్చును. దాసుడు తన విశ్రాంతి కొరకు సడలింపు కోరవచ్చుననేది ఒక పరీక్ష. దీనిని ఉదహరించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనేవారు. వజూ కూడ ఒక పరీక్షే. అనగా చలి కాలములో కఠిన చలి పడుచుండగా, చలి గాలి వీచుచుండగా, కొంతైనా గాలి తగిలినచో మానవునికి బాధ కలుగును. ఈ వ్యాసమును నేను పదే పదే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నోట విన్నాను.

రెండవ భాగము అనగా రెండవ పరీక్ష ఏమిటో వారు ప్రస్తావించలేదు. పరీక్షలలో గల వివేకము ఏమిటో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివరించిన పంక్తిని నేను చదివి వినిపించెదను. వారిట్లనిరి. తన దాసులకు ఎటువంటి బాధ కలిగించకుండా, అన్ని విధాలా సఃఖ సంతోషాలతో జీవితము గడిపేటట్లు చేయుటలో అల్లాహ్ శక్తి కలిగి యుండెను. వారి జీవితము రాజుల వలె నుండును. ప్రతి సమయము వారి కొరకు రాజభోగాలు అందించబడేవి. కాని అలా జరగలేదు. ఇందులో అనేక రహస్యములు, గుణపాఠములు యుండెను. చూడుము! తల్లిదండ్రులు తమ కూతురు పట్ల ఎంతో ప్రేమ కలిగివుందురు. అధికముగా కుమారుల కంటే ఎక్కువ కుమార్తె పట్ల ప్రేమ యుండును. కాని ఒక సమయమున తల్లిదండ్రులు తమ నుండి కూతురును దూరము చేయుదురు. ఆ సమయమును చూచుట ధైర్యవంతుల పని. ఇరువైపుల స్థితి దయనీయముగా నుండును. (వివాహము సమయమున తల్లిదండ్రులతో పాటు కూతురు కూడ రోధించును) సుమారు 14,15 సం॥లు ఒక చోట నుందురు. వారి వీడ్కోలు సమయము చాలా బాధాకరముగా నుండును. ఈ వీడ్కోలును క్రూరమనినా అనవచ్చును. వివాహము తర్వాత, అత్తగారింట్లో, భర్త వద్దకు పోయినప్పుడే బహిర్గతమయ్యే కొన్ని సామర్థ్యములు కూతురులో గలవు. ఇది ఇరువురికి శుభము, కరుణాయమముగా నుండును. ఇదే పరిస్థితి దైవ పురుషులది. బాధలు, కష్టములు రానిదే బహిర్గతము కాని పలు శక్తులు వారిలో దాగి నుండను. దైవ సమీపులుగా అగుటకు బాధలను అనుభవించి, కృతజ్ఞత తెలుపుట తప్పనిసరి. ప్రతి క్రొత్త దినము తనపై క్రొత్త మరణమును స్వీకరించవలసి యుండును. ప్రాపంచిక కోరికలను వీడి మానసిక వాంచ వైపున మరణము స్వీకరించనిదే ఎన్నడు అంతము కాని జీవితము అతనికి లభించదు. ఆ తర్వాత ఎన్నడు మరణించదు. పరీక్షలో గల వివేకపు సంక్షిప్త రూపమిది.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. నా వయసు తొమ్మిది, పది సంవత్సరములున్నప్పుడు గృహములో నేను మరొక విద్యార్థితో ఆడుకుంటుండగా అక్కడే నున్న ఒక బీరువాలోని పుస్తకము తెరిచి చూడగా ఇప్పుడు జిబ్రాయీల్ అవతరించదని అందులో వ్రాసి యుండెను. ఇది సరైన విషయము కాదు, ఎందుకనగా నా తండ్రిపై జిబ్రాయీల్ అవతరించుచున్నాడని నేనంటిని. జిబ్రాయీల్ అవతరించదని పుస్తకములో వ్రాసి యున్నదని ఆ బాలుడు అనెను. మా మధ్య వాదన జరిగినది. తుదకు మేమిద్దరము హజ్రత్

గారి వద్దకు పోయినాము. మేమిద్దరము తమ, తమ వాదనను వినిపించితిమి. వారిట్లనిరి. పుస్తకములో వ్రాసినది తప్పు. జిబ్రాయిల్ ఇప్పటికి అవతరించును.

అనంతరం తమ ఒక సంఘటన ప్రస్తావించిరి. అనేక సార్లు నేనీ సంఘటనను గుర్తు చేసుకొని నవ్వుకున్నాను. కొన్ని సార్లు కన్నీరు కూడ పెట్టుకున్నాను. కాని నేను దీనిని ఎంతో గౌరవముగా చూచెదను. ఆ సంఘటన ఇట్లు గలదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో వేసవి కాలములో ఒక సారి ఆకాశములో మబ్బులు కమ్ముకొనెను. గట్టిగా పిడుగులు పడెను. ఆ పిడుగు పడ్డప్పుడు మేము ఇంటి ప్రాంగణములో నిద్రించుచుంటిమి. లేచి లోపలికి వెళ్ళిపోయినాము. నాకు ఇప్పటికి ఆ దృశ్యము గుర్తున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం లోపలికి వెళ్ళుచున్నప్పుడు నేను నా రెండు చేతులు పిడుగు పడినచో నాపై పడవలెను కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై పడకూడదని వారి తలపై పెట్టినాను. మా వలన వారు కాదు, వారి వలన మేము పిడుగు నుండి రక్షించబడేవారమని తర్వాత నాకు తెలివితేటలు వచ్చినప్పుడు తెలుసుకొని నా ఈ కార్యము పై నాకు నవ్వు వచ్చినది.

హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం రజియల్లాహు అన్హు మృతి సంఘటనను వారిట్లు తెలిపిరి. క్రీ.శ. 1905లో మౌల్వీ అబ్దుల్ కరీం గారు అనారోగ్యమునకు గురైరి. వారి మరణ వార్త వినినప్పుడు నేను భరించే శక్తిని కోల్పోయి యుంటిని. పరుగెత్తి నా గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకున్నాను. నిర్జీవ శరీరము వలె నేను నా మంచముపై పడిపోయినాను. కన్నీరు ప్రవహించుచుండెను.

క్రీ.శ. 1908 సంఘటనను వారిట్లు తెలిపిరి. అది నా కొరకు బాధాకరమైనదే కాక అహ్మదీయులందరి జీవితములో నూతన కాలము మొదలగుటకు కారణమైనది. ప్రాణరహితమైన మన శరీరములకు ఆత్మ వలె నున్న, మన కాంతి రహిత నేత్రములకు చూపు వలె నున్న, మన అంధకార హృదయములకు జ్యోతి వలె నున్న వ్యక్తి విడిపోయిరి. ఇది వీడ్కోలు కాదు ప్రళయ దినముగా నుండెను. పాదముల క్రింది నుండి భూమి కదిలినది. ఆకాశము తన స్థానమును వీడెను. దైవ సాక్ష్యముగా అప్పుడు ఆహారము, వస్త్రము పట్ల ఆలోచన లేకుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ప్రపంచము మొత్తము వీడినా నేను వీడను, ఈ సంఘమును ప్రపంచములో స్థిరపరతును అనే ఒకే ఒక్క ఆలోచన యుండెను. ఈ ప్రతిజ్ఞను నేను ఎంత వరకు పాటించినానో నాకు తెలియదు. కాని ఎల్లప్పుడు ఈ ఉద్ధేశమును దృష్టిలో వుంచుకొని నేను పని చేసినాను. వారు ఈ ప్రతిజ్ఞనను పూర్తిగా పాటించినారని సంస్థ ప్రతి సభ్యుడు, తర్వాత వచ్చు వారు కూడ సాక్ష్యముగా నున్నారు. మేము కూడ ప్రతిజ్ఞలను పాటించుటకు సరైన రీతిలో మాకు మార్గదర్శనము చేసినారు. తమ ప్రతిజ్ఞలను పాటించు అనుగ్రహము అల్లాహ్ మనకు కూడ కలిగించుగాక!

ఇప్పుడు నేను రెండు అంత్యక్రియ ప్రార్థనలు చదివింతును. ఒకటి ప్రత్యక్ష జనాజ. మాంచెస్టర్ యు.కెలో నున్న ముల్తాన్ నివాసులు క్రీ.శే. చౌద్రీ అబ్దుర్రహీమ్ గారి సతీమణి గౌ॥ సురయ్యా బేగం గారిది. 77 సం॥ల వయసులో 11 నవంబర్ తేదీన వారు మృతి చెందిరి. اِنَّا لِلّٰہِ وَاِنَّاۤ اِلَیۡہِ رٰجِعُوۡنَ. నమాజుల పట్ల జాగరూకులు, సత్ప్రవర్తనల గల, సహనశీలురు, కృతజ్ఞత బావము కలిగి వున్న పుణ్య స్త్రీ, వసియ్యత్ కూడ చేసి యుండిరి. అల్లాహ్ వారి అంతస్తులను పెంచు గాక! వారి సత్కార్యములను వారి సంతానము కొనసాగించు గాక!

యమన్ నివాసులు గౌ॥ మహ్మూద్ అబ్దుల్లాహ్ షబూతీ గారిది రెండవది పరోక్ష జనాజ. షబూతి గారు 9 నవంబర్ 2014 తేదీన సుదీర్ఘ అనారోగ్యము తర్వాత మృతి చెందిరి. రెండవది పరోక్ష జనాజ 24 మే

1934 తేదీన యమన్‌లో జన్మించిరి. వారి తండ్రి జూన్ 1952లో జామిఅ అహ్మదియ్య రబ్వాలో విద్యాభ్యాసం కొరకు వారిని రబ్వా పంపిరి. 1960లో (ముబల్లిఘ్ చదువు పూర్తి చేసుకొని) యమన్ తిరిగి వచ్చిరి. అహ్మదీయులైనను, అహ్మదీయేతరులైనను తమ బంధువుల పట్ల వారు ఆప్యాయతతో వ్యవహరించేవారు. సతీమణి సయ్యదహ్ నసీమ్ షాహ్ గారితో పాటు ఐదుగురు కుమారులు, పన్నెండు మనుమలు, మనుమరాల్లు వారు తమ జ్ఞాపకముగా వదిలిరి. వారి ఒక్క కుమారుడు కెనడాలో వున్నారు. నాసిర్ అహ్మద్ గారు ఇక్కడ ఇంగ్లాండ్‌లోనే వున్నారు. అల్లాహ్ వారి అంతస్తులను పెంచు గాక! వారి సంతానమునకు వారి అడుగుజాడలపై నడిచే అనుగ్రహము కలిగించు గాక! (ఆమీన్)

✡✡✡

✡✡✡✡✡✡

*Summary: Majlis Ansarullah Bharat, Translation:Hafiz Syed Rasool Niyaz, (Telugu Desk)*

Published by: Nazarath Nashr-O-Isha'ath, e-mail:telugudesk@yahoo.in
P.O.:Qadian, Dist:Gurdaspur, Pin:143516, Punjab, Mob 84376 99866

BOOK POST (PRINTED MATTER)

*To,*

..........................................................................................

..........................................................................................